

ఏయూ సందర్శన

విశాఖ సిటీ: ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ, ఏయూ పూర్వ విద్యార్థి పి.రాజబాబు శుక్రవారం ఆంధ్రా యూనివర్సిటీని సందర్శించారు.



పాల సముద్రంలా..

అరకులోయ రూరల్: మండలంలోని బిగంగుడి వ్యూ పాయింట్ సమీపంలో పొగ మంచు పాల సముద్రాన్ని తలపించింది.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉండి తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 21న 21 మి.మీ, 22న 10, 23న 10, 24న 28, 25న 24 మి.మీ వర్షపాతం నమోదవుతుందన్నారు.

న్యూస్‌రీల్

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



స్వచ్ఛతా హీ సేవా ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: స్వచ్ఛతా హీ సేవా స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రత బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. స్వచ్ఛతా హీ సేవ -2024 కార్యక్రమంలో భాగంగా రేబాక గ్రామంలో వివిధ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమంపై ఆమె గ్రామస్తులతో మాట్లాడారు. ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్తులకు తెలియజేశారు. ఇంటింటికీ వెళ్లి గృహిణులతో కలెక్టర్ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో మంజులవాణి, ఎంపీడీవో నర్సింగరావు, సర్పంచ్ మార్బూరు సన్యాసమ్మ, పంచాయతీ కార్యదర్శి వి.ఈశ్వరరావు, మహిళలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

51 మంది వీఆర్‌వోలకు బదిలీలు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) గ్రేడ్-2 బదిలీల కౌన్సెలింగ్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్ కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీల కోసం మొత్తం 234 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. జీవో ప్రకారం మొత్తం 51 మందికి బదిలీలు నిర్వహించారు.

డీసీసీ అధ్యక్షుడిగా మీసాల సుబ్బన్న



డీసీసీ అధ్యక్షుడిగా నియామకమైన మీసాల సుబ్బన్నను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

తుమ్మపాల: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితుడైన మీసాల సుబ్బన్న.. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి.ఎస్.దత్తు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలో న్యూకాలనీలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామారావు పాల్గొని సుబ్బన్నను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విప్పల పైడయ్య, తనకాల అనంతరావు, మలపురెడ్డి కోటేశ్వరరావు, బోయిన భానుమూర్తి యాదవ్, తుట్టా రమణ, కత్తెర శ్రీధర్, పడాల కొండలరావు పాల్గొన్నారు.

బ్రాండిక్స్ కంపెనీ పేరు మార్పు

- అధిస్టాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్(ఏఐఐపీ)గా మార్పు

సాక్షి, అనకాపల్లి: అచ్యుతాపురంలో బ్రాండిక్స్ తన ప్రయాణంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. బ్రాండిక్స్ ఇండియా అపెరల్ సిటీ(బీఐఏసీ) పేరిట ఉన్న పేరును 'అధిస్టాన్ ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ పార్క్'గా శుక్రవారం రీ బ్రాండింగ్ చేసినట్లు ప్రకటించింది. 2006లో ప్రారంభమైనప్పటి నుంచి బీఐఏసీ ఇంటిగ్రేటెడ్ హబ్‌గా అభివృద్ధి చెందుతూ.. 1,00,000 మందికి ఉపాధి కల్పించినట్లు కంపెనీ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ కస్టమర్లకు సానుకూలమైన సమగ్ర వాతావరణాన్ని సృష్టించే దిశగా ఈ మార్పు చేసినట్లు తెలిపారు. 1,000 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పార్క్ అపెరల్‌తో పాటు ఇతర పరిశ్రమలకు కేంద్రంగా వైవిధ్యమైన సుస్థిర వాతావరణంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు పోలీసు భద్రత తొలగింపు

మహారాణిపేట (విశాఖ): కూటమి ప్రభుత్వం ఏర్పడి తరువాత ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్రకు 1+1 ఉన్న పోలీసు భద్రతను తొలగించారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా మారుమూల ముంచంగిపుట్టుకు చెందిన సుభద్రకు నిబంధనల మేరకు భద్రత కల్పించాలి. గన్‌మెన్లు లేకుండా శుక్రవారం ఆమె జెడ్పీ కార్యాలయానికి రావడంతో కొందరు విలేకర్లు ప్రశ్నించగా..కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలగించారని ఆమె బదులిచ్చారు. భద్రత కల్పించాలని డీజీపీ, డీఐజీ, ఇంటెలిజెన్స్ ఐజీకి లేఖ రాసినా ఇంతవరకు ఎటువంటి సమాధానం రాలేదని తెలిసింది.

భారీగా ఎస్‌ఐల బదిలీ

-8లో

పోలీసులమని బెదిరించి.. మాటల్లో పెట్టి..



ఈ ఏడాది జూన్ నెల 15వ తేదీన పరవాడలోని ఒక ఫార్మా కంపెనీ ఏజీఎం రాజేష్ (పేరు మార్పు)కు ముంబాయి నుంచి పోలీస్ ఇన్వెస్టిగేషన్ టీం అంటూ ఒక కాల్ వచ్చింది. 'మీ బ్యాంక్ ఖాతా నుంచి అనాథరైజ్డ్ బ్యాంక్ లావాదేవీలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. విచారణలో భాగంగా ఆర్‌బీఐతో కలిపి మా పోలీస్ బృందం మీ బ్యాంక్ ఖాతా వివరాలు పరిశీలిస్తుంద'ని చెప్పారు. దీంతో రాజేష్ 'అదేమి లేదండీ.. నా బ్యాంక్ వివరాలు ఇవి' అంటూ .. బ్యాంక్ ఖాతా నంబర్, పూర్తి వివరాలు చెప్పాడు. విచారణలో భాగమంటూ వారు వీడియో కాల్ చేయగా.. (నకిలీ) ఆర్‌బీఐ అధికారికి బ్యాంక్ ఏటీఎం, బ్యాంక్ బుక్ చూపించాడు. 20 నిమిషాల పాటు వీడియో కాల్ చేసిన తరువాత చూస్తే.. బ్యాంక్ ఖాతాలో మూడు దఫాలుగా రూ.13 లక్షలు కట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. దీంతో వెంటనే 1930 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. గోల్డెన్ అవర్ లోపల తెలపడంతో పోలీసులు మొత్తం రూ.13 లక్షలు రికవరీ చేయడంతో పాటు..సైబర్ నేరగాడి బ్యాంక్ ఖాతాలో మరో రూ.60 వేలు సీజ్ చేశారు.

ఆన్‌లైన్ గేమ్ పేరిట మోసం



అనకాపల్లి మండలంలో తుమ్మపాల గ్రామానికి చెందిన గరికిపాటి వెంకట నాగసతీష్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. డ్యూటీ అయిన వెంటనే ఇంటికి వచ్చి మొబైల్‌లో సోషల్ మీడియాలో గడపడం తనకు పరిపాటి. గత మే నెల 15న ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియోలు చూస్తుండగా.. తెలియని ఖాతా ద్వారా 'తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు గెలుచుకోవాలంటే ఇలా..' అంటూ ఆన్‌లైన్ గేమ్ పేరిట ఒక లింక్ వచ్చింది. అదేంటో అని క్లిక్ చేశాడు. డిటైల్స్ అడిగింది. పూర్తి వివరాలు నమోదు చేశాడు. ఇందులో ఈ గేమ్ ఆడాలంటే తొలుత రూ.10 వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మొదటిగా రూ.10 వేలు ఆన్‌లైన్ పేమెంట్ చేశాడు. తొలి గేమ్ గెలిచాడు. రూ.4,499 గెలుచుకున్నాడు. కొన్ని నిమిషాల్లోనే ఆ సొమ్ము తన అకౌంట్‌కు జమ అయ్యింది. అక్కడి నుంచే సైబర్ నేరగాళ్లు ఆట ప్రారంభించారు. తొలుత రూ.4,499 ఎరగా వేశారు. ఎప్పుడైతే పూర్తి వివరాలు ఇచ్చాడో.. ఒక్కసారిగా తన బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.5.68 లక్షలు మాయం చేశారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఖాతా నుంచి రూ.1.19 లక్షల వరకు రికవరీ చేయగలిగారు.

అమెజాన్ ఉద్యోగం పేరుతో టోపీ



అనకాపల్లి టౌన్‌లో గల గవరపాలేనికి చెందిన మళ్ల పవన్ (మణికంఠ) నిరుద్యోగి. ఉద్యోగం కోసం సోషల్ మీడియా సెర్చ్ చేస్తూ ఉంటాడు. జనవరి 31న వాట్సాప్‌లో అమెజాన్ కంపెనీలో ఉద్యోగాలు కావాలంటే ఈ లింక్‌పై క్లిక్ చేయండని వచ్చింది. క్లిక్ చేస్తే ముందుగా వెయ్యి రూపాయలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. పోతే పోయిందని ఫోన్‌పే ద్వారా చెల్లించాడు. వారం రోజులు పోయాక.. మరో రూ.1,400 పంపించమని చెప్పారు. నువ్వు ఉద్యోగానికి ఎంపికయ్యావంటూ మూడు నాలుగు విడతలుగా రూ.1.80 లక్షల వరకు వసూలు చేశారు. ఆ తరువాత నుంచి వాట్సాప్ పనిచేయలేదు. మోసపోయానని గమనించి సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు వెంటనే స్పందించి మణికంఠ ఖాతా నుంచి వెళ్లిన డబ్బులో రూ.1.20 లక్షలు రికవరీ చేశారు.

బ్యాంక్ ఉద్యోగం ఇస్తున్నట్టు నమ్మించి..

నర్సీపట్నానికి చెందిన కొవ్వాడ నాగు గతేడాది ఏప్రిల్ 23న ఉద్యోగాల కోసం గూగుల్ సెర్చ్‌లో నౌకరి డాట్ కమ్‌కు తన బయోడేటా పంపించాడు. వారం రోజుల్లో కోటక్ మహీంద్ర బ్యాంక్‌లో ఉద్యోగానికి ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ఉంటుందని చెప్పారు. తరువాత రోజు కాజల్ మెహతా అనే మహిళ ఫోన్ చేసి.. హైదరాబాద్ కోటక్ మహీంద్ర బ్యాంకు బ్రాంచ్‌లో ఆపరేషన్ మేనేజర్ ఉద్యోగానికి మీ పేరు షార్ట్‌లిస్ట్ చేశామని మొబైల్ ద్వారా టెలిఫోన్ ఇంటర్వ్యూ చేసింది. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.2,850 కట్టాలని చెప్పి ఆ మొత్తాన్ని ఎస్‌బీఐ ఖాత నెంబర్: 33788967045లో జమ చేయమని చెప్పగా జమ చేశాడు. వారం రోజుల తర్వాత నమితా గోయేల్ అనే వ్యక్తి ఫోన్ చేసి బ్యాక్ గ్రౌండ్ స్క్రీనింగ్ కోసం రూ.7,500 ఖాతాలో జమ చేయమని చెప్పగా ఆ మొత్తాన్ని ఖాతాలో జమ చేశాడు. ఆ తరువాత ఉద్యోగానికి ఎంపికయ్యావని.. ప్యూరిటీ కోసం రూ.27,500 కట్టాలని ఫోన్ రాగా అనుమానం వచ్చిన బాధితుడు కార్యాలయం అడ్రస్ చెబితే అక్కడికి వచ్చి చెల్లిస్తానని చెప్పాడు. వెంటనే ఫోన్ కట్ అయ్యింది. మోసపోయనని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

- పెట్రేగిపోతున్న ఆన్‌లైన్ మోసగాళ్లు
- టెక్నాలజీని వినియోగించుకుని చీటింగ్
- సురక్షిత డిజిటల్ లావాదేవీలతోనే సైబర్ నేరాలకు చెక్
- విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జిల్లాలో సైబర్ నేరాల వివరాలు

సంవత్సరం	కేసులు
2021	128
2022	152
2023	201
2024(సెప్టెంబర్ 15 వరకు)	164

సైబర్ వల.. చిక్కితే విలవిల..



సాక్షి, అనకాపల్లి: ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. చాలా మంది సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోతున్నారు. రోజురోజుకు పెరుగుతున్న సాంకేతిక విప్లవం.. ఎక్కువవుతున్న నగదు రహిత లావాదేవీలు.. అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఓ రకంగా సన్మార్గాలే. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే. రెండో పైపు కష్టజీవులను దోచుకునే సైబర్ బూచోళ్లు కాచుకుని కూర్చున్నారు. వారి ఉచ్చులో పడి ఇల్లు గుల్ల చేసుకునే వారి సంఖ్య అనేకం. గుర్తు తెలియని సోషల్ మీడియా ఖాతాల నుంచి గానీ.. ఫేక్ అకౌంట్‌ల నుంచి ఆన్‌లైన్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ గేమ్‌లు పేరిట లింక్‌లు వస్తే క్లిక్ చేసి మోసపోవద్దంటూ పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. అవగాహన లేక కొందరు .. తెలిసి కూడా మరికొందరు మోసపోతున్నారు. ఉపాధి పేరిట నిరుద్యోగులను.. ఆన్‌లైన్ గేమ్‌ల పేరిట యువతను సైబర్ నేరగాళ్లు బోల్తా కొట్టిస్తున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం లాంటి నగదురహిత లావాదేవీలు ఎక్కువవడంతో యువత, ఉద్యోగులనే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేస్తున్నారు.

కొన్నిసార్లు డిజిటల్ లావాదేవీలలో తలెత్తే సమస్యల పరిష్కారాల కోసం గూగుల్, యూట్యూబ్‌ల్లో సెర్చ్ చేసుకుంటూ వాటి పరిష్కార మార్గాలు వెతుక్కుంటున్నారు. అయితే ఆ విధానం కొన్ని విషయాల్లో మంచిదైనా.. ఎక్కువ మంది యువత, విద్యార్థులు, ఉద్యోగులు సైబర్ నేరగాళ్ల వలలో పడిపోవడానికి ఇది కూడా ఒక కారణమనే సైబర్ పోలీసులు చెబుతున్నారు. గూగుల్లోనే ఫేక్ యాప్‌లు, ఫేక్ లింక్‌లు అప్‌లోడ్ చేసి మొత్తం డేటాని తస్కరిస్తున్న ఘటనలు జరుగుతున్నాయి.

యువత తస్మాత్ జాగ్రత్త

ప్రతి ఒక్కరికీ తెలియని సమాచారం కోసం గూగుల్ సెర్చ్‌కు వెళ్లి వివిధ లింక్‌లను క్లిక్ చేస్తూ సమాచారం తెలుసుకోవడం అలవాటు. వీటిపైనే సైబర్ నేరగాళ్లు నిఘా పెడుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్, టెలిగ్రామ్ వంటి యాప్‌ల ద్వారా యువతను సైబర్ మోసగాళ్లు ఉచ్చులోకి లాగుతున్నారు. అందమైన అమ్మాయిల పేరిట ఫేక్ అకౌంట్‌లను క్రియేట్ చేసి గేలం వేయడం.. బ్యాంక్ ఫ్రాడ్ ఓటీపీలు, లింక్‌లు, కస్టమర్ కేర్ పేరిట సైబర్ నేరగాళ్లు మరింత మోసాలకు పాల్పడుతున్నారు. దీంతో జిల్లాలో పోలీసులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డిజిటల్ లావాదేవీలలో ఎటువంటి సమస్య తలెత్తినా.. బ్యాంక్‌కు వెళ్లి సంప్రదించాలే తప్ప, గూగుల్‌లో సెర్చ్ చేయొద్దని హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తతే ఆయుధం..



ఇప్పుడు ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయి. పలువురు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. బాధితులు గోల్డెన్ అవర్‌లోపే పోలీసులకు ఫిర్యాదు చేస్తే రికవరీకి అవకాశం ఉంటుంది. 1930కు ఫోన్ చేసి, అదే విధంగా సైబర్‌క్రైం. జీవోవీ.కమ్‌లో కూడా ఫిర్యాదు చేయాలి. విద్యావంతులే ఎక్కువగా సైబర్ మోసాల బారిన పడడం ఆందోళన కలిగిస్తోంది. డబ్బు సులువుగా సంపాదించాలన్న అత్యాశకు పోయి మోసపోతున్నారు. సైబర్ మోసాలపై అప్రమత్తతే ఆయుధం.

– ఎం.దీపిక, ఎస్పీ, అనకాపల్లి

ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్నాం..

బ్యాంక్ నుంచి ఫ్రాడ్ ఓటీపీలు, రుణాలు, కస్టమర్ కేర్ పేరిట ఖాతాదారులనే సైబర్ నేరగాళ్ల టార్గెట్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 252 ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంక్‌లు, 400కు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల ఏటీఎంలున్నాయి. అన్ని బ్రాంచిల్లోనూ పోలీసులతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సైబర్ నేరగాళ్ల వలలో పడి ఖాతాదారులు మోసపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రజలు అప్రమత్తంగా ఉంటే చాలా మోసాలను విముక్తి లభిస్తుంది. లేనిపోని ఆశలు పెంచుకుంటే మోసగాళ్ల బుట్టలో పడడం ఖాయం.

–సత్యనారాయణ, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

సురక్షిత డిజిటల్ లావాదేవీలు ఇలా..

- బ్యాంక్ లావాదేవీలకు సంబంధించి లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, యూపీఐ పిన్, ఓటీపీ, ఏటీఎం , డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డుల వివరాలు ఎవరితో కూడా పంచుకోకూడదు.
- ఆన్‌లైన్‌లో డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు బార్‌కోడ్‌లు, క్యూఆర్ కోడ్‌ల స్కానింగ్ చేయొద్దు.
- ఫోన్‌కాల్, ఈ-మెయిల్ చేసి మీ కేవైసీ అప్‌డేట్ చేయాలని వివరాలు అడిగినా చెప్పొద్దు. అనుమానం ఉండే బ్యాంక్ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లి చెక్ చేయండి. హోం బ్యాంక్ శాఖను సంప్రదించడం ఉత్తమం.
- ఈ-మెయిల్‌లు, ఎస్ఎంఎస్‌లలో యూఆర్ఎల్, డొమైన్ పేర్లలో స్పెల్లింగ్ లోపాలుంటే జాగ్రత్తగా తనిఖీ చేయండి. ఇవి 'హెచ్‌టీటీపీఎస్'తో ప్రారంభమవుతాయి. ఆన్‌లైన్ బ్యాంకింగ్ కోసం అధికార వెబ్‌సైట్‌లనే ఉపయోగించండి.
- ఏదైనా వెబ్‌సైట్, అప్లికేషన్‌లో మీ ఈ-మెయిల్‌ను యూజర్ ఐడీగా నమోదు చేస్తున్నప్పుడు మీ ఈ-మెయిల్ పాస్‌వర్డ్‌ను 'పాస్‌వర్డ్'అని పెట్టుకోవద్దు.
- పొరపాటున మీ ఫోన్ పే, గూగుల్ పే ఖాతాలలో డబ్బులు వేశామని, వాటిని వెనక్కి పంపండి.. అని మీకు ఎవరైనా కాల్ చేసినట్లయితే తిరిగి డబ్బులు పంపకండి.
- గూగుల్ సెర్చ్‌లో కస్టమర్ కేర్ నంబర్ కోసం వెతుకుతున్నప్పుడు నకిలీ వెబ్‌సైట్లు ఉంటాయి. అప్రమత్తంగా ఉండాలి.
- ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ పేరిట బ్లాక్ మెయిల్ చేసి నేరాలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో మిమ్మల్ని ట్రాప్ చేయడానికి మీకు గిఫ్ట్ కూపన్లను కూడా పంపించే అవకాశాలు ఉన్నాయి. డేటింగ్ సైట్లు, డేటింగ్ యాప్స్‌పై జాగ్రత్తగా ఉండాలి.

ఘనంగా గురజాడ జయంత్యుత్సవాలు ప్రారంభం



గురజాడ జయంత్యుత్సవాల్లో భాగంగా చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఎస్.రాయవరం: గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో గురజాడ అప్పారావు 163వ జయంత్యుత్సవాలు ఒక్క రోజు ముందుగా శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గురజాడ ఫౌండేషన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొలిశెట్టి గోవిందరావు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా గురజాడ కాంస్య విగ్రహాన్ని ముస్తాబు చేశారు. శుక్రవారం రాత్రికి యలమంచిలి కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. బజారులో ఉన్న గురజాడ కాంస్య విగ్రహానికి శనివారం ప్రముఖులు, స్థానిక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేశారు.

ఎస్‌ఎఫ్‌ఐ చలో కలెక్టరేట్ ఉద్రిక్తం



విద్యార్థుల సమస్యలపై కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో విద్యార్థుల సమస్యలు పరిష్కారం కాకపోవడాన్ని నిరసిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శుక్రవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ ఉద్రిక్తతకు దారితీసింది. వసతి గృహాల్లో మెస్ చార్జీలు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులతో పాటు వసతి దీవెన, విద్యా దీవెన నిధులు విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.రమణ, ప్రెసిడెంట్ ఎ.గీతకృష్ణ, ఉపాధ్యక్షుడు బాలాజీ మాట్లాడుతూ సకాలంలో విద్యార్థి స్కాలర్‌షిప్ విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో మినీ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. హాస్టళ్లలో దోమలు తెరలు అందించాలని, నెలకొకసారి వైద్య శిబిరాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలపై డీఆర్వో బి.దయానిధికి వినతిపత్రం అందజేశారు. ఈ సమయంలో విద్యార్థులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కేకలు వేయడంతో డీఆర్వో అసహనం వ్యక్తం చేశారు. వెనుదిరిగి వెళ్లిపోతున్న ఆయనను అడ్డుకునేందుకు విద్యార్థులు ప్రయత్నించారు. ఆయన కలెక్టరేట్‌లోకి వెళ్లడంతో విద్యార్థులు కూడా లోపలికి వెళ్లే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగి, స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, వారం రోజుల్లో దోమల తెరలు అందిస్తామని డీఆర్వో హామీ ఇవ్వడంతో విద్యార్థులు శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వైస్ ప్రెసిడెంట్ కేశవ, సంఘం నాయకులు శ్రీను, కామేష్, వెంకటేష్, రమేష్ , నర్సీపట్నం డివిజన్ సభ్యులు జ్ఞానేష్, స్వామి, అర్జున్, దుర్గా, మోహన్, సాయి, వరహాలు, దుర్గా, అనకాపల్లి, నర్సీపట్నం , యలమంచిలి, పాయకరావుపేట, చోడవరం మండలాల నుంచి 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు



కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నించిన విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు

పరిశ్రమలు కాదు మృత్యు కుహరాలు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సమావేశానికి హాజరైన కార్మికులు

- సెజ్‌లలో రక్షణ చర్యలకు తిలోదకాలు
- పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్న ప్రభుత్వాలు
- ఏపీని ఆదానీ, అంబానీలకు తాకట్టు పెడుతున్న ప్రజాప్రతినిధులు
- ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత రక్షణ యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అనకాపల్లి/అచ్యుతాపురం (మునగపాక): పరవాడ-అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమలు మృత్యు కుహరాలుగా మారాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు ఊడిగం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. జిల్లాలో ఐదు రోజులుగా సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఫార్మా, సెజ్ కార్మికుల భద్రత, రక్షణ యాత్ర అచ్యుతాపురంలో శుక్రవారం ముగిసింది. ఫార్మా కంపెనీల్లో ఇటీవల ఘోర ప్రమాదాలు జరగడంతో కార్మికుల రక్షణ కోరుతూ సీపీఎం యాత్ర నిర్వహించింది. ముగింపు సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరవాడ-అచ్యుతాపురం సెజ్‌లో ఫార్మా కెమికల్ ఇతర పరిశ్రమలలో ప్రమాదాలు జరుగుతూ కార్మికులు మృత్యువాత పడుతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించారు. ఈ పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యాన్ని కూడా అరికట్టలేని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ప్రజలకు క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేరని, పర్యావరణాన్ని సర్వనాశనం చేస్తున్నా ప్రశ్నించే వారే లేరన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఏపీ నెం.1గా ఉందని చెప్పుకుంటున్నారే గానీ.. ఈజ్ ఆఫ్ డెత్ బిజినెస్‌గా రాష్ట్రం మారుతుందని ఎందుకు గ్రహించడం లేదని ధ్వజమెత్తారు. ఆదానీ, అంబానీ లాంటి సంపన్నుల కోసమే ప్రధానమంత్రి మోదీ పనిచేస్తున్నారన్నారు.

భూ సేకరణ సరే.. పరిశ్రమలు ఎక్కడ?

పారిశ్రామిక కారిడార్ పేర్లతో లక్షల ఎకరాలు సేకరిస్తున్నారని, ఇటీవల కాలంలో కాకినాడలో 10,000 ఎకరాలు సేకరించి 150 ఎకరాల్లో ఒక్క పరిశ్రమ మాత్రమే తీసుకొని వచ్చారని శ్రీనివాసరావు అన్నారు. చెన్నై-విశాఖ కారిడార్ కోసం ప్రభుత్వం 2.5 లక్షల ఎకరాల భూసేకరణ చేసిందని.. ఇప్పటివరకూ పరిశ్రమలు రాలేదన్నారు. పెత్తందారుల కబంధ హస్తాల్లో ఎన్నాళ్లు మగ్గుతారని, ముందుకు వచ్చి పోరాడండి అని పిలుపునిచ్చారు. పరిశ్రమలకు నీళ్లు, కరెంటు, భూములు ఇవ్వటంపై దృష్టి సారిస్తున్న ప్రభుత్వాలు.. అవే పరిశ్రమలు ఎటువంటి భద్రత చర్యలు తీసుకోకపోయినా పర్వాలేదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని కాపాడకుండా తెగనమ్మేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం ప్రధాని మోదీ చెప్పిందే వేదంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రక్షణయాత్రలో భాగంగా పాయకరావుపేట నుంచి పరవాడ వరకు యాత్ర నిర్వహించి కార్మికులు, నిర్వాసితుల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ప్రజలకు, కార్మికులకు అండగా ఎర్రజెండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఇటీవల దివంగతులైన సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఈ సందర్భంగా నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యురాలు బి.ప్రభావతి, జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు, గనిశెట్టి సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. సీపీఎం మండల కార్యదర్శి రొంగలి రాము అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ నేతలు డి.వెంకన్న, ఎం.అప్పలరాజు, జి.కోటేశ్వరరావు, జి.దేముడుబాబు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, పి.మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో వైద్యుల నిరసన ప్రదర్శన



అనకాపల్లి: కూటమి ప్రభుత్వం వైద్య విభాగంలో విడుదల చేసిన జీవో నంబర్.85ను రద్దు చేయాలని స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద శుక్రవారం గ్రామీణ ప్రాంతం పీహెచ్‌సీ వైద్యులు ప్లకార్డులతో ధర్నా చేశారు. అనంతరం డీఎంఅండ్ హెచ్‌వో బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఎస్.తిరుపతిరావు, ఎస్టేర్ రాణి, యశోద, వాణి, మనీషా, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీసు సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

- పోలీస్ గ్రీవెన్స్ డేలో ఎస్పీ దీపిక



ఎస్పీ దీపికకు సమస్య వివరిస్తున్న హెచ్‌సీ

అనకాపల్లి: తమ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ ఎం.దీపికకు తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే జరిగింది. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వారివారి సమస్యలను ఎస్పీకి విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యక్తిగత, వృత్తిపరమైన, శాఖాపరమైన సమస్యలు గురించి సిబ్బంది తెలియజేసినట్లు తెలిపారు. త్వరితగతిన పూర్తయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని దిగువస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సదరం క్యాంప్‌లో 47 మంది అర్హుల గుర్తింపు



దివ్యాంగులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో శుక్రవారం కోటవురట్ల, నక్కపల్లి మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించినట్లు ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించేందుకు 47 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. శనివారం నాతవరం, గొలుగొండ మండలాలకు చెందిన దివ్యాంగుల కోసం సదరం క్యాంపు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతపై కక్ష సాధింపు చర్యలు

- అప్పారాయుడుపాలెంలో సెప్టిక్ ట్యాంక్ తొలగింపు
- టీడీపీ నేతల ఒత్తిడితో తొలగించిన అధికారులు
- ఘటనపై ఎస్పీ, డీపీవోకి బాధితుడి ఫిర్యాదు



పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సెప్టిక్ ట్యాంక్



సెప్టిక్ ట్యాంక్ తొలగింపుపై అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత సన్యాసినాయుడు, స్థానికులు

రాంబిల్లి (యలమంచిలి): రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చి వంద రోజులు గడిచాయి. మంచి ప్రభుత్వం వచ్చింది అని ప్రచారాలు చేసుకుంటున్న కూటమి నేతలు వైఎస్సార్‌సీపీ నేతలపై వారి ఆస్తులపై దౌర్జన్యాలకు తెగబడుతున్నారు. అధికారులు సైతం టీడీపీ నేతల ఒత్తిడితో ప్రతిపక్ష నేతల ఆస్తులపై దాడులు చేస్తున్నారు. రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెం గ్రామానికి చెందిన ఉప్పులూరి సన్యాసినాయుడుకు యలమంచిలి పంచదార్ల, అప్పారాయుడుపాలెం బైపాస్ రోడ్డులో తన జిరాయితీ స్థలంలో షాపులు ఉన్నాయి. అక్కడ మరుగుదొడ్డి, సెప్టిక్ ట్యాంక్ నిర్మించుకున్నాడు. అతడు ప్రభుత్వ స్థలంలో తాగునీటి బోరు అనుకుని సెప్టిక్ ట్యాంక్ నిర్మించాడని, వెంటనే తొలగించాలని టీడీపీ నేతలు మరపురెడ్డి శ్రీను, మరపురెడ్డి పెద నాగేష్, మరపురెడ్డి జోగిబాబు, మరపురెడ్డి పెద్దఅయ్యలు, మరపురెడ్డి నాగేష్, మరపురెడ్డి మచ్చేశ్వరరావు రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేశారు. ఈ మేరకు రాంబిల్లి ఈవోపీఆర్డీ సన్యాసిరాజు, పంచదార్ల పంచాయతీ సెక్రటరీ జి. శివకుమార్, సర్వేయర్ ఎం అశ్విని, వీఆర్వో శ్రావణి, రాంబిల్లి పోలీసులు డి.సుభాషిణిరాణి, ఏఎస్ఐ రంగారావు, జి.నరసింగరావు కలసి గురువారం సెప్టిక్ ట్యాంక్‌ను పొక్లెయిన్‌తో తొలగించారు. దీనిపై సదరు వైఎస్సార్‌సీపీ నాయకుడు మాట్లాడుతూ టీడీపీ నేతలు, అధికారులు కుమ్మక్కై తన సెప్టిక్ ట్యాంక్‌ను అన్యాయంగా తొలగించారని, అడ్డుకుంటున్న తమ కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించారని వాపోయాడు. దీనిపై ఎస్పీ, డీపీవో కార్యాలయాల్లో, రాంబిల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరాడు. ఎటువంటి నోటీసులు జారీ చేయకుండా సెప్టిక్ ట్యాంక్ ఏ విధంగా తొలగిస్తారని రాంబిల్లి ఈవోపీఆర్డీని ప్రశ్నించగా నచ్చినట్లు చేస్తామని దురుసుగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రభుత్వ స్థలంలో నిర్మించడం వల్లే తొలగించాం

తాగునీటి బోరు పక్కన ప్రభుత్వ స్థలంలో సెప్టిక్ ట్యాంక్ నిర్మించడం వల్ల నీరు కలుషితం అవుతుందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వేయర్ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా ప్రభుత్వ స్థలంలో సెప్టిక్ ట్యాంక్ తొలగించాం.

– సన్యాసిరాజు, ఈవోపీఆర్డీ, రాంబిల్లి

ఫిర్యాదు వచ్చింది

సెప్టిక్ ట్యాంక్‌కు సంబంధించిన వివాదంపై బాధితుడి నుంచి మాకు ఫిర్యాదు వచ్చింది. స్థల సమస్య రెవెన్యూ, పంచాయితీ రాజ్ అధికారుల పరిధిలోనిది. దాన్ని పరిష్కరించాలని వారిని కోరాం.

సి.హెచ్ నర్సింగరావు, సీఐ, రాంబిల్లి

జాతీయ స్థాయిలో బీసీ కులగణన జరగాలి

- బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

తుమ్మపాల: దేశంలో వెనుకబడిన కులాల ఆర్థిక, సామజిక, రాజకీయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం వెంటనే బీసీ కుల జన గణన నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భక్కా పరంజ్యోతి డిమాండ్ చేశారు. బీసీ కుల గణన కోసం అక్టోబర్‌లో విజయవాడలో జరిగే మహా ధర్నాకు బీసీ కుల సంఘాలను, పార్టీ శ్రేణులను సమాయత్వం చేసేందుకు బహుజన సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన బీసీ కుల సంఘాల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా దేశంలో బీసీ సామాజిక వర్గాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోకుండా అట్టడుగున దుర్భర జీవితాలు గడపడం అత్యంత బాధాకరమని చెప్పారు. రాజ్యాధికారంలో బీసీలకు రావలసిన వాటా దక్కకపోవడమే దీనికి కారణమన్నారు. బీసీ కులాల్లో ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారన్నది స్పష్టంగా తెలిసినప్పుడే ఎవరికి దక్కవలసిన రాజ్యాధికారం, అభివృద్ధి ఫలాలు వారికి అందుతాయని చెప్పారు. అందుకోసమే బహుజన సమాజ్ పార్టీ బీసీ కుల గణన కోసం పోరాడుతోందని తెలిపారు. అనంతరం బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ శాసనసభ్యుడు రాజారావు, కరణం తిరుపతిరావు తదితరులు మాట్లాడారు. బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుదే చిన్నారావు, జిల్లా ఇన్‌చార్జి బొట్ట నాగరాజు, వివిధ బీసీ సంఘాల రాష్ట్ర నేతలు నమ్మి అప్పలరాజు, బొట్టా చిన్ని యాదవ్, బొడ్డేడ అప్పారావు, బద్దం పైడిరాజు, ఆళ్ల ప్రవీణ్ కుమార్, జొన్నకోట చేన్న మూర్తి పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో తృతీయ స్థానం

కశింకోట: అంతర్రాష్ట్ర అథ్లెటిక్స్‌లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఎస్.ఝాన్సీ తృతీయ స్థానం సాధించింది. ఇటీవల నల్గొండలో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 14 వంద మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ చాటింది. శుక్రవారం ప్రిన్సిపాల్ రూపనంది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి అభినందించారు.

ఫైనల్స్‌కు చేరిన బాక్సర్ మౌనిక

నర్సీపట్నం: గౌహతిలో యూత్ సీనియర్ నేషనల్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో నర్సీపట్నానికి చెందిన బాక్సర్ బొంతు మౌనిక ఫైనల్స్‌కు అర్హత సాధించిందని కోచ్ అబ్బు తెలిపారు. 80 కేజీల విభాగం సెమీ ఫైనల్స్‌లో బౌట్ మణిపూర్‌పై గెలిచి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. ఈ పోటీల్లో గెలిస్తే స్వర్ణం కైవసం చేసుకుంటుందని కోచ్ తెలిపారు.

మాది ప్రజా ప్రభుత్వం

- ప్రజావేదిక ద్వారా సమస్యల పరిష్కారం
- హోం మంత్రి వంగలపూడి అనిత



పాయకరావుపేట: తమది ప్రజా ప్రభుత్వమని, ప్రజల సంక్షేమమే తమ ధ్యేయమని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా స్థానిక మండల పరిషత్ ఆవరణలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు హామీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేశారన్నారు. గ్రామ పంచాయతీ నిధులను రోడ్లు, డ్రైనేజీలకు ఖర్చు చేస్తామన్నారు. త్వరలో పాయకరావుపేట మెయిన్‌రోడ్డును విస్తరిస్తామన్నారు. ప్రతి గ్రామంలోను, మండలంలోను ప్రజావేదిక ఏర్పాటు చేసి వినతులు స్వీకరిస్తామన్నారు. ప్రతీ మండలంలో మూడు ఫిర్యాదు బాక్సులు చొప్పున ఏర్పాటు చేసి ప్రతి సోమవారం మధ్యాహ్నం వాటిని ప్రతీ సమస్య పరిష్కరించాలన్నారు. అనంతరం పట్టణంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షలతో నిర్మించ తలపెట్టిన భవనానికి మంత్రి అనిత శంకుస్థాపన చేశారు. డీఎంహెచ్‌వో బాలాజీ, ఎంపీడీవో ఎ.సాంబశివరావు, తహసీల్దార్ కె.జయప్రకాష్, ఎంపీపీ ఇసరపు పార్వతీ, వైస్ ఎంపీపీలు ధనిశెట్టి మాధవి, పల్లేల స్వామి పాల్గొన్నారు.

భారీగా ఎస్‌ఐల బదిలీ

అనకాపల్లి: జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న 34మంది ఎస్‌ఐలను బదిలీ చేసినట్లు ఎస్పీ ఎం.దీపిక శుక్రవారం చెప్పారు. ఈమేరకు ఆమె ఉత్తర్వులు ఇచ్చారు.

ఎస్‌ఐ పేరు	పాత స్టేషన్	కొత్త స్టేషన్
ఎం.రామారావు	నాతవరం	పరవాడ యూపీఎస్
బి.కృష్ణారావు	గొలుగొండ	పరవాడ యూపీఎస్
డి.నాగేంద్ర	దేవరాపల్లి	రాంబిల్లి యూపీఎస్
పి.సింహాచలం	యలమంచిలి రూరల్	సబ్బవరం యూపీఎస్
డి.ఈశ్వరరావు	బుచ్చియ్యపేట	అనకాపల్లి టౌన్
అల్లు వెంకటేశ్వరరావు	డీఎస్‌బీ–అనకాపల్లి	అనకాపల్లి టౌన్
ఎండి.అలీషారీఫ్	అనకాపల్లి టౌన్	అనకాపల్లి ఉమెన్ పీఎస్
ఎ.శ్రీనివాసరావు	వీఆర్, అనకాపల్లి	బుచ్చియ్యపేట
బి.సురేష్‌బాబు	వీఆర్, అనకాపల్లి	ఐటీ కోర్, అనకాపల్లి
జి.ధనంజయనాయుడు	వీఆర్, అనకాపల్లి	సబ్బవరం పీఎస్
ఎం.నారాయణ	అచ్యుతాపురం	సీసీఎస్, అనకాపల్లి
కె.సుధాకర్	నర్సీపట్నం టౌన్	అచ్యుతాపురం
జె.రమేష్	వీఆర్, అనకాపల్లి	నర్సీపట్నం టౌన్
ఎస్.ప్రసాద్	వీఆర్, అనకాపల్లి	డీసీఆర్‌బీ, అనకాపల్లి
కె.సన్నిబాబు	వీఆర్, అనకాపల్లి	నక్కపల్లి
ఎస్.అప్పలకొండ	వీఆర్, అనకాపల్లి	పీసీఆర్, అనకాపల్లి
ఎస్.కె.మదీనావలి	వీఆర్, అనకాపల్లి	పీసీఆర్, అనకాపల్లి
ఎస్.కె.రషీద్	వీఆర్, అనకాపల్లి	అనకాపల్లి ట్రాఫిక్
జె.నాగేశ్వరరావు	వీఆర్, అనకాపల్లి	అనకాపల్లి రూరల్
జి.విశ్వనాథం	వీఆర్, అనకాపల్లి	డీఎస్‌బీ, అనకాపల్లి
ఎన్.భాస్కరరావు	వీఆర్, అనకాపల్లి	సీసీఎస్ బుచ్చెయ్యపేట
పి.కామేశ్వరరావు	వీఆర్, అనకాపల్లి	డీసీఆర్‌బీ, అనకాపల్లి
పి.ప్రసాద్‌రావు	వీఆర్, అనకాపల్లి	పరవాడ
ఎం.సురేంద్రకుమార్	వీఆర్, అనకాపల్లి	ఎన్‌హెచ్‌క్యూటర్ఎకెపి
ఎం.వెంకటరావు	వీఆర్, అనకాపల్లి	అచ్యుతాపురం
పి.వి.వి.రమణ	వీఆర్, అనకాపల్లి	సీసీఎస్, నర్సీపట్నం (రూ)
కె.సత్యనారాయణ	వీఆర్, అనకాపల్లి	సీసీఎస్‌నర్సీపట్నం (ట్రా)
బి.అన్నాజీబాబు	పీసీఆర్, అనకాపల్లి	డీఎస్‌బీ, అనకాపల్లి
డి.శేఖరం	చోడవరం	అనకాపల్లి ట్రాఫిక్
పి.మనోజ్‌కుమార్	---	కశింకోట
జి.సత్యనారాయణ	---	అనకాపల్లి ట్రాఫిక్
యు.రాజారావు	---	పాయకరావుపేట
డి.ఫణిదాస్	---	సీసీఎస్, అనకాపల్లి
కె.సంతోష్‌కుమార్		అనకాపల్లి టౌన్

రోడ్డు ప్రమాదంలో సైక్లిస్టు మృతి



మృతి చెందిన రాజాన చిన్నయ్య

యలమంచిలి రూరల్: మండలంలోని లక్కవరం సమీపంలో శుక్రవారం స్కూటీ, సైకిల్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో పురుషోత్తపురానికి చెందిన రాజాన చిన్నయ్య(80) దుర్మరణం చెందాడు. పొలం పని నిమిత్తం పురుషోత్తపురం నుంచి లక్కవరం వెళ్లిన అతడు తన సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా వెనుక నుంచి స్కూటీ ఢీకొట్టింది. దీంతో చిన్నయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్కూటీ వెనుక ప్రయాణిస్తున్న మరొకరు గాయపడ్డాడు. ఇద్దర్నీ 108 వాహనంలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలిస్తుండగా వృద్ధుడు మార్గమధ్యంలోనే ప్రాణాలొదిలాడు. సైకిల్‌ను ఢీకొట్టిన నిందితుడు యలమంచిలి మండలం ఏటికొప్పాకకు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. శవపంచనామా, పోస్టుమార్టం అనంతరం వృద్ధుడి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. ప్రమాదంపై యలమంచిలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి సీహెచ్‌సీ పారిశుధ్య కార్మికుల సమ్మె

కె.కోటపాడు: సమస్యల పరిష్కారం కోసం కె.కోటపాడు సీహెచ్‌సీ పారిశుధ్య సిబ్బంది ఈ నెల 30 నుంచి సమ్మెలోనికి వెళ్తున్నట్టు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మికి శుక్రవారం పారిశుధ్య సిబ్బందితో కలిసి సమ్మె నోటీసును అందజేసినట్టు చెప్పారు.

ప్రహసనంగా 'స్థాయీ' సమావేశాలు



స్థాయి సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి

- ఆమోదం పొందిన అంశాలపై విమర్శలు
- తమకు అనుకూలంగా లేని అంశాలు వాయిదా

డాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ స్థాయీ సంఘం సమావేశాలు గాడి తప్పుతున్నాయి. ఆమోదం పొందిన అంశాలపై విమర్శలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ స్థాయీ సంఘ సభ్యులకు అనుకూలంగా ఉన్న కొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం తెలుపుతుండగా..చాలా అంశాలు వాయిదా వేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంతా పారదర్శకంగా సమావేశాలు జరగ్గా..కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి పనికీ ఎంతో కొంత ప్రతిఫలం లేనిదే పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాదాపు ఆరేడు నెలల తర్వాత ఈ నెల 13న నూతన సభ్యులతో సంఘ సమావేశం నిర్వహించారు. 280 అజెండా అంశాలకు గాను 150 వరకు చర్చించారు. వాటిలో 50 అంశాలు వాయిదా వేశారు. ఈ నెల 17న మిగిలిన అజెండా అంశాలకు సంబంధించి మరో సమావేశం నిర్వహించారు. ఆ సమావేశంలో 6 అంశాలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. తాజాగా శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం స్థాయీ సంఘ చైర్మన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన నిర్వహించారు. గత రెండు స్థాయీ సమావేశాల్లో వాయిదా పడ్డ 56 అంశాలతో పాటు మరో 68 అంశాలు జోడించి మొత్తంగా 124 అంశాలు సభ్యుల ఆమోదానికి చర్చకు తీసుకొచ్చారు. వీటిలో 2 అంశాలు (34, 35 అంశాలు) తిరస్కరించగా ఏకంగా 63 అంశాలను సభ్యులు వాయిదా వేశారు. అయితే ఈ అంశాలకు సంబంధించి కార్పొరేటర్లకు సంబంధిత పనులు నిర్వహించే కాంట్రాక్టర్లకు మధ్య డీల్ కుదరకపోవడమే కారణమని తెలుస్తోంది. 59 అంశాలు పరిపాలన, కార్మికుల జీతాలకు సంబంధించిన అంశాలు ఆమోదించారు.

భోజనం నాణ్యత లోపిస్తే చర్యలు

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

మాకవరపాలెం: మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని డీఈవో వెంకటలక్ష్మమ్మ స్పష్టం చేశారు. మండలంలోని జి.గంగవరం ప్రాథమిక, మాకవరపాలెం ఉన్నత పాఠశాలలను శుక్రవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. విద్యాబోధనపై కూడా వివరాలు సేకరించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం ఇక్కడ నూతనంగా నిర్మించిన బాలికల వసతిగృహాన్ని పరిశీలించారు. త్వరలో ఈ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట ఎంఈవో మూర్తి, పాఠశాల హెచ్‌ఎం అచ్యుత రామయ్య ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- కారు, 64 కేజీల గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులతో ఎస్‌ఐ మల్లేశ్వరరావు, తదితరులు

దేవరాపల్లి: ఏజెన్సీ నుంచి కారులో అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను ఎస్‌ఐ టి. మల్లేశ్వరరావు పట్టుకున్నారు. దేవరాపల్లి మీదుగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు గురువారం సాయంత్రం శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద ఎస్‌ఐ తన సిబ్బంది కలిసి కాపు కాశారు. కారులో తరలిస్తున్న 64 కేజీల గంజాయితో పాటు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ వెల్లడించిన వివరాల ప్రకారం.. గంజాయితో పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా పనసపుట్టు పంచాయతీ శివారు జామిగుడ గ్రామానికి చెందిన కొర్రా రంజు, కొర్రా అర్జున్‌తో పాటు పెదబయలకు చెందిన కారు డ్రైవర్ కూడ కార్తీక్ ఉన్నారు. వీరి ముగ్గురిని అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించారు. పట్టుబడిన వారిలో రంజు, అర్జున్ గంజాయి పండిస్తున్నారు. వారి దగ్గర నుంచి కారు యజమానులైన ఒడిశాకు చెందిన గుంజా గోపి, హుకుంపేట మండలం గన్నెలపూట్‌కు చెందిన కొర్ర శివ కలిసి కొనుగోలు చేసిన 64 కేజీల గంజాయితో కారులో నలుగురు బయలుదేరారు. పెదబయలుకు రాగానే కారు యజమానులు ఇద్దరూ కారును అదే గ్రామానికి చెందిన కూడ కార్తీక్‌కు అప్పగించారు. కారులో గంజాయిని దేవరాపల్లి మీదుగా విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకుంటే, అక్కడికి తామిద్దరం వస్తామని చెప్పి కారు యజమానులు ఇద్దరు దిగిపోయారు. దీనిపై పక్కా సమాచారంతో శ్రీరాంపురం వై జంక్షన్ వద్ద స్థానిక పోలీస్‌లు మాటు వేసి పట్టుకున్నారు. కారు యజమానులు ఇద్దరు పరారీలో ఉన్నారని, కారును సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వడ్డాది, కశింకోట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



విద్యార్థులకు ఉపాధ్యాయుల అభినందనలు

బుచ్చెయ్యపేట: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు వడ్డాది కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీన అనకాపల్లిలో అండర్ –14 స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. 30 కేజీల బాలిక విభాగంలో దాసరి రోహిణి, 40 కేజీల బాలుర విభాగంలో గోడ చరణ్, 28 కేజీల బాలుర విభాగంలో పొంగి రిషి ఎంపికయ్యారు. ఈ నెల 22, 23 తేదీల్లో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం శేషుబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతోపాటు పేరెంట్స్ కమిటీ చైర్మన్ కోవెల వెంకట రమణ, పీడీ నరశింగరావు శుక్రవారం స్థానిక పాఠశాలలో అభినందించారు.

కశింకోట: రాష్ట్ర స్థాయి జూడో పోటీలకు స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూలుకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియంలో అండర్ - 17 విభాగంలో నిర్వహించిన పోటీలో వీరు ప్రతిభ చాటారు. విద్యార్థులు బి. రోహిత్, ఎం. శరత్, కె. అఖిల్, అజీజ్ స్వర్ణాలు, జె.మధు, రామచరణ్, వంశీకృష్ణ రజత పతకాలు సాధించారు. వీరిలో స్వర్ణ పతకాలు సాధించిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కానున్నట్లు పీడీ వి.ప్రభాకరరావు తెలిపారు. ఆయనతోపాటు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నక్కా నాగమణి, ఉపాధ్యాయులు ఎం.జె.వి.కె. ప్రసాద్, ఆనంద్, అప్పారావు, లక్ష్మీకాంతం శుక్రవారం అభినందించారు.

వేతనాలు పెంచకుంటే సమ్మెకు సిద్ధం

- డెయిరీ యాజమాన్యానికి వేతన కార్యదర్శుల హెచ్చరిక



మాట్లాడుతున్న సహకార పాల సంఘాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ

అనకాపల్లి: సహకార సంఘాల ద్వారా పాలను సేకరించి విజయ విశాఖ డెయిరీకి పంపుతూ సంస్థను లాభాల బాటలో నడిచేందుకు కృషి చేస్తున్న పాల సంఘాల కార్యదర్శులకు, వర్కర్లకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, ఐదు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సహకార పాల సంఘాల(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ తెలిపారు. స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారి రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్లో శుక్రవారం ఉత్తరాంధ్ర జిల్లాల పాల సంఘాల నేతల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. డెయిరీ యాజమాన్యం కార్మికుల పట్ల చిన్నచూపు చూస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం కార్మికులను డెయిరీ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ వంటి సదుపాయలు కల్పించాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ట్రస్టులో యాజమాన్యం వాడుకున్న ఎనిమిది కోట్ల రూపాయల తిరిగి వడ్డీతో చెల్లించాలన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి సమ్మెకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. మొదటి దశలో జోనల్ కార్యాలయం వద్ద దశలు వారీగా ఉద్యమాలు చేస్తామని, యాజమాన్యం చర్యలు తీసుకోకపోతే సమ్మెకు సిద్ధపడతామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వై.ఎస్.భద్రం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు, సభ్యులు దొడ్డి సూర్యారావు, జి.కనకారావు, కరక సోమునాయుడు, శ్రీకాకుళం నుంచి ప్రసాద్, విజయనగరం నుంచి జామి అప్పలనాయుడు, విశాఖ నుంచి సన్యాసినాయుడు, రవి, లక్ష్మణరావు, తూర్పుగోదావరి జిల్లా నుంచి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరులు ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీవంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 196వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు అంపోలు గోపాల కృష్ణశర్మ, పాందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు, సాయి వేద మంత్రాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వీట్ స్విమ్మింగ్ ఫ్రెండ్స్ కుటుంబ సభ్యులు చైర్మన్ భీమరశెట్టి వరహ నూకరాజు దంపతులు పాల్గొన్నారు. గౌరీగీతా మహిళా మండలి వ్యవస్థాపకురాలు పెతకం శెట్టి సుజాత బృందం కోలాటం ఆకట్టుకుంది.

నేడు సీతారాం ఏచూరి సంతాప సభ

తుమ్మపాల: గవరపాలెం గౌరీ గ్రంథాలయం కొణతాల సుబ్రహ్మణ్యం హాలులో సీతారాం ఏచూరి సంతాప సభ శనివారం నిర్వహించనున్నట్లు సీపీఎం నాయకుడు కాళ్ల తేలయ్యబాబు తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని కోరుకుంటూ పార్లమెంటులో ఏచూరి అనేక రకాల పోరాటాలు చేశారన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ మృతి చెందిన సీతారాం ఏచూరి స్మరించుకొనుటకు ఈ సంతాప సభకు హాజరు కావాలని కోరారు. సభకు ముఖ్య వక్తలుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్ శర్మ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పెంటకోట శ్రీనివాసరావు, బుగిడి నూక అప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడి మృతి

అనకాపల్లి: రేబాక గ్రామానికి చెందిన చిట్లా నాగరాజు(60) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు రూరల్ పోలీస్‌లకు ఫిర్యాదు అందింది. రూరల్ ఏఎస్‌ఐ సత్తిబాబు వివరాలు మేరకు... ఈనెల 19వ తేదీన రేబాక గ్రామంలో రోడ్డు దాటుతుండగా అనకాపల్లి నుంచి సబ్బవరం వెళ్తున్న బైక్ ఢీకొనడంతో అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం అదేరోజు కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 225 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,970
రెండో రకం	3,410	3,910
మూడోరకం	3,100	3,320

అనకాపల్లి సినిమాలు

గొర్రె పురాణం	:రాజా
ఏఆర్ఎం 3డీ	:సత్యనారాయణ స్క్రీన్-1
మత్తు వదలరా 2	: సత్యనారాయణ స్క్రీన్-2
ఆయ్	: పర్తిసాయి
సరిపోదా శనివారం	: షిర్డీసాయి
చిక్లెట్స్	:వెంకటేశ్వర
మన్యం ధీరుడు సీతారామరాజు	:శ్రీసత్య
హైడ్ ఎన్ సీక్	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-7 యూనిట్, బీ పాజిటివ్-22 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 428 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 374 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

వంద రోజులు.. వట్టి మాటలు

ఓటు వేసేంత వరకు ఓడ మల్లన్న.. ఓటు వేశాక బోడి మల్లన్న అని చంద్రబాబు వంద రోజుల పాలనలో చెప్పకనే చెప్పారు. రోజుకో అబద్ధం చెప్పి ఎన్నికల హామీలను గాలికొదిలేశారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టి, ఆనక ఏ ఒక్క పథకమూ అమలు చేయకుండా ప్రజా వ్యతిరేకత మూటగట్టుకున్నారు. సరికదా ప్రజల కష్టాలను పట్టించుకున్న పాపాన పోలేదు.

- అనకాపల్లి శారదానది ఒడ్డున పర్యాటక కేంద్రం ఎక్కడ..?
- తుమ్మపాల చక్కెర కర్మాగారంలో మిథైల్ ప్లాంట్ జాడేలేదు
- పట్టణ నడిబొడ్డున కంపోస్టు యార్డు తరలింపు శూన్యం
- రహదారుల అభివృద్ధి ఉన్నట్టా... లేనట్టా...?
- కూటమి పాలనలో అటకెక్కిన ఎన్నికల హామీలు



పర్యాటక కేంద్రంగా చేస్తామని చెప్పిన శారదానది



శంకరం వద్ద పూడికతో నిండిపోయిన పులి కాలువ



జీవీఎంసీ కార్యాలయంలో కంపోస్టుయార్డు

అనకాపల్లి/తుమ్మపాల: ఎన్నికల వరకు ఒకలా.... ఎన్నికలయ్యాక మరొకలా వ్యవహరిస్తుంది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమీ ప్రభుత్వం. సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో లేనిపోని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 100 రోజులంటూ చేపడుతున్న సంబరాలతో ప్రజలు నివ్వెరపోతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో దేశానికి అన్నం పెట్టే రైతులకు పెట్టుబడి సాయం దగ్గర నుంచి అమ్మఒడి, చేయూత, వాహనమిత్ర, వంటి అనేక పథకాలకు స్వస్తిచెప్పి ప్రజల చెవుల్లో పూలు పెట్టి 100 రోజులు అవుతున్న సందర్భంగా సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా మారింది. బయటకు చెప్పలేకపోయినప్పటికీ ప్రతీ వ్యక్తి ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతున్నారు. కూటమి నాయకులు అత్యుత్సాహంతో కనీసం సచివాలయాలకు కూడా వెళ్లి పనులు చేసుకునే పరిస్థితి లేకుండా కూటమి పాలన సాగుతోంది.

అమలు కాని ఎమ్మెల్యే కొణతాల ఎన్నికల హామీలు...

ప్రస్తుత ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గానికి సాగు, తాగునీరు అవసరాలు తీరుస్తామని చెప్పి వంద రోజులు గడుస్తున్నా, ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది. కనీసం నియోజకవర్గంలో సమస్యలపైన దృష్టి పెట్టడంలో విఫలమయ్యారు.

- పట్టణ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచలేదు. డ్రైనేజీలో పూడికతీత పనులు చేపడతామని నేటికీ చర్యలు లేకపోవడంతో వర్షపునీరు రహదారులపై పారుతోంది. ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- పట్టణం మీదుగా వరి పొలాల్లోకి వెళ్లే ప్రధాన కాలువల పూడికతీత పనులు నిమిత్తం ప్రభుత్వం రూ.80 లక్షలు మంజూరు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో చేపట్టకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు.
- పట్టణ పరిధిలో శారదానది ఒడ్డున టూరిజం ప్రాంతంగా చేస్తామని చెప్పి, నేటికీ అటువైపు కన్నెత్తి చూడలేదు.
- **పట్టణ నడిరోడ్డు జీవీ**ఎంసీ కార్యాలయం వద్ద **కంపోస్టు యార్డును** అధికారం చేపట్టిన నెల **రోజుల్లో తరలిస్తామని** పూర్తి స్థాయిలో తరలించలేదు. **దీనివల్ల వేల్పులవీధి**, ఉడ్‌పేట, నెహ్రూ **చౌక్, న్యూకాలనీ, నర్సిం**గరావుపేటతోపాటు **కంపోస్టు యార్డుకు ఆనుకున్న** జీవీఎంసీ పెద్ద హైస్కూల్ **విద్యార్థులకు దుర్గం**ధం బాధలు తప్పడం లేదు.
- చిన్న నాలుగు రోడ్ల నుంచి గాంధీబొమ్మ జంక్షన్ రైల్వే స్టేషన్ రహదారిలో గత ప్రభుత్వం రహదారి విస్తరణకు కావలసిన అన్ని పనులు చేసింది. ఇంత వరకూ దీన్ని నిర్మించడంతో విఫలమయ్యారు.
- పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి జాతీయ రహదారిలో పెట్రోల్ బంకు వద్ద రహదారిని అభివృద్ధి చేయలేదు. దీంతో అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే వాహనదారులు భారీ గోతుల్లో పడిపోయి ఇబ్బందులు పడుతున్నప్పటికీ ఎమ్మెల్యే పట్టించుకోలేదు.
- నియోజకవర్గంలో 15 ఏళ్ల క్రితం నాటి సాగునీటి కాలువలు ఆక్రమణలు తొలగిస్తామని, పూడిక తొలగించి వాటి అభివృద్ధి పనులు చేపడతామని ఇచ్చిన హామీపై దృష్టి సారించలేదు. దాంతో ఇటీవల కురిసిన వర్షాలకు అనేక గ్రామాల్లో వరి పంట నీట ముంపునకు గురై రైతులు తీవ్రంగా నష్టపోయారు.
- అత్యంత కాలుష్య ప్రాంతంలో నివసిస్తున్నామని, గ్రామాల్లో దీనికి కారణమైన క్వారీలు, క్రషర్లను నియంత్రించి నిబంధనల మేరకు చర్యలు చేపడతామని ఇచ్చిన హామీ ఒట్టిమూటలేనని తేల్చేశారు.
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్వారీల ద్వారా ఖనిజాన్ని మరింత వేగంగా తరలిస్తున్నారు. బ్లాస్టింగ్‌లు పెట్టి ఖనిజాన్ని తవ్వేస్తున్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు గ్రామాల మీదుగా పరుగులు తీస్తున్నాయని, ప్రశ్నించిన వారిపై దాడులు చేస్తున్నారని అనేక మంది అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారంటే ఎమ్మెల్యే నిర్లక్ష్యపు పనితీరుకు అద్దం పడుతోంది.
- తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో మిథైల్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేసి రైతులకు మేలు చేయడంతోపాటు నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పి మోసం చేశారు.

వంద రోజుల్లో వంద కష్టాలు



టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయింది. కాని ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చలేదు. నాకు పాప, బాబు ఉన్నారు. కూలీ పనులతో జీవనం సాగించే మాకు పిల్లల చదువుకు జగనన్న ఏడాదికి రూ.12 వేలు అందించేవారు. కూటమి ప్రభుత్వంలో పాఠశాలలు ప్రారంభమై మూడు నెలలు దాటుతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదు. అబద్ధపు హామీలతో ఓట్లు వేయించుకుని మాలాంటి పేదవారిని మోసం చేసింది.

– జి.రామఅప్పారావు, అనకాపల్లి

వేడుకగా దసరా ఉత్సవ పందిరి రాట

గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



అమ్మవారి ఆలయం వద్ద దసరా ఉత్సవ రాట వేస్తున్న భక్తులు



అమ్మవారి నవరాత్రులు పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆలయ నూతన కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం సతకంపట్టు కనకదుర్గ ఆలయ దసరా నవరాత్రుల మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆలయం వద్ద పందిరి రాట వేశారు. భక్తులు పాల్గొన్ని అమ్మవారి రాట ఉత్సవాన్ని తిలకించారు. అనంతరం కనకదుర్గ ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా భీమరశెట్టి వరాహ నూకరాజు, డైరెక్టర్లుగా విల్లూరి మాధవ, పిళ్లా తారకేష్, పొలమరశెట్టి యుగంధర్, కర్రి కల్యాణ్, కాండ్రేగుల వెంకట సాంబశివ, దాడి త్రినాథ్, భీశెట్టి ప్రసన్న, మళ్ల రాజు, దాడి కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, ఆలయ నిర్వాహకుడు కాండ్రేగుల నాయుడు మాట్లాడుతూ నూతన కమిటీ ఎన్నిక రెండు సంవత్సరాలు పాటు ఉంటుందన్నారు. ఆలయ మాజీ చైర్మన్ దాడి జయవీర్ మాట్లాడుతూ అక్టోబర్ 3 నుంచి 12వ తేదీ వరకూ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. 3 నుంచి 7వ తేదీ వరకూ మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో రోజు సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకూ నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం అమ్మవారి దసరా నవరాత్రులు ఉత్సవ, నాటిక, క్యాలండర్ పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సీనియర్ నాయకులు కొణతాల మురళీకృష్ణ, కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, కర్రి సన్యాసినాయుడు, కె.ఎం.నాయుడు పాల్గొన్నారు.

చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమకు పురస్కారం



బంగారు పురస్కారం అందుకుంటున్న చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

కశింకోట: మండలంలోని చెట్టినాడ్ సిమెంట్ పరిశ్రమకు క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా విశాఖ చాప్టర్ నుంచి బంగారు పురస్కారం లభించింది. విశాఖ నగరంలో రెండు రోజులపాటు వ్యక్తులపై పెట్టుబడులు–మంచి భవిష్యత్‌ను నిర్మించడం అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఉక్కు పరిశ్రమ సీజీఎం గాంధీ నుంచి పురస్కారాన్ని శుక్రవారం అందుకున్నారు. పరిశ్రమ ప్రతినిధులు కృపా, బాలాజీ, రామకృష్ణ, శివమోహన్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర కాపాడుకోవడం మనందరి బాధ్యత



ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది

తుమ్మపాల: అధికంగా రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్లు వాడడం వల్ల వాటి నుంచి వెలువడే క్లోరోఫ్లోరో కార్బన్లతో ఓజోన్ పొర దెబ్బతింటుందని, తద్వారా సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల వల్ల అనేక రకాల క్యాన్సర్లకు, కంటి సంబంధ వ్యాధులకు కారణమవుతుందని జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఎస్. ఇందిరా దేవి తెలిపారు. రాష్ట్ర సాంకేతిక మండలి, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఓజోన్ పొర ఆవశ్యకత గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓజోన్ పొర దెబ్బ తినడం వల్ల సకల జీవరాశి మునగడ ప్రశ్నార్థకం అవుతోందన్నారు. ఓజోన్ పొర కాపాడుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత అన్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయిని ఇ. లక్ష్మీపద్మ మాట్లాడుతూ ఓజోన్ పొర స్ట్రాటో ఆవరణం కింది భాగంలో ఉంటుందన్నారు. తక్కువ మందంలో ఉండే ఓజోన్ పొర వల్ల సమస్త జీవరాశికి ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఓజోన్ పొరకు రంధ్రం పడడం వల్ల వృద్ధాప్యం, రోగ నిరోధక శక్తి తగ్గడం, కిరణజన్య సంయోగ క్రియ దెబ్బతినడం వంటి పలు రకాల సమస్యలకు కారణమన్నారు. ఓజోన్ పొర ఒక గొడుగులా భూవాతావరణాన్ని కాపాడుతోందన్నారు. విద్యార్థినులకు జూనియర్, సీనియర్ విభాగాలలో వ్యాస రచన, పోటీలు నిర్వహించి ఏపీ కాస్ట్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని ఓ.రుధిరరాణి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓ. రమాదేవి, ఓ. సత్యనారాయణ, ఎస్.రామాంజనేయులు, రామచంద్రరావు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి

ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కశింకోట: రాజకీయాలకు అతీతంగా గ్రామాలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ హామీ ఇచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కల్యాణ మండపంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఏ పార్టీ వారు పదవిలో ఉన్నా వివక్షకు తావు లేకుండా అభివృద్ధి చేపడతామన్నారు. రూ.కోటిన్నరతో కశింకోట పంచాయతీ పరిధిలో రోడ్లు, కాలువలు తదితర అభివృద్ధి పనులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను రానున్న ఐదేళ్లలో క్రమేపి అమలు చేసి నెరవేర్చడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేస్తామన్నారు. కశింకోటలో వారం రోజుల్లో రెండు పూటలా రెండేసి గంటల వంతున కుళాయి నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీధి కుళాయిలతోపాటు ప్రైవేటు, ఇంటింటి కుళాయిలకు శారదానది అవతల ఉన్న బోర్ల నుంచి సురక్షితమైన మంచినీటిని అందిస్తామన్నారు. పలువురు తమకు ఇంటింటి కుళాయిలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జల జీవన్ మిషన్ కింద మండలంలోని గ్రామాల్లో ఇంటింటి కుళాయిలు అందరికి అందివ్వడానికి రూ.పది కోట్లు మంజూరు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, ప్రత్యేక అధికారి శిరీషారాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, జనసేన నాయకులు బుదిరెడ్డి చిన్న, పావాడ కామరాజు, లోక్‌సత్తా జిల్లా నాయకుడు భీశెట్టి బాబ్జీ, పంచాయతీరాజ్ డీఈ సత్యనారాయణ, ఎంపీడీవో వి.వి. రవికుమార్, ఉప తహసీల్దార్ సురేష్‌నాయుడు, పెంటకోట రాము పాల్గొన్నారు.

హుషారుగా మండల స్థాయి స్కూల్ గేమ్స్



ఖో-ఖో ఆడుతున్న విద్యార్థులు



కశింకోట బాలికల హైస్కూలులో ఆటల పోటీలను ఆసక్తిగా తిలకిస్తున్న బాలికలు



కబడ్డీ ఆడుతున్న బాలురు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ, బాలికల హైస్కూళ్లలో శుక్రవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో వివిధ స్కూళ్ల నుంచి 300 మంది బాలురు హాజరయ్యారు. అండర్- 11, 14, 17 విభాగాల్లో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, చదరంగం, యోగా పోటీలు నిర్వహించారు. ఆయా స్కూళ్ల జట్లు పోటా పోటీగా ఉత్కంఠభరితంగా ఆడాయి. విద్యార్థులు ఆద్యంతం ఆసక్తిగా ఆటలను తిలకించి ఆనందపరవశులయ్యారు. పీడీలు పెంటకోట కమల, వి. ప్రభాకరరావు, పీఈటీలు ఆటలు ఆడించారు. నియోజకవర్గ స్థాయి పోటీలకు ప్రతిభావంతులైన క్రీడా జట్లు ఎంపిక చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. చివరి రోజు శనివారం బాల, బాలికలకు అథ్లెటిక్స్ జరగనున్నట్లు పీఈటీ కమల తెలిపారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో రెండో రోజు బాలుర విజేత జట్ల వివరాలను పీడీ పెంటకోట కమల శుక్రవారం తెలిపారు. ఖో-ఖో 14 ఏళ్ల విభాగంలో కన్నూరుపాలెం హైస్కూలు, కింగ్స్ ఐడీఎల్ స్కూలు, 17 ఏళ్ల విభాగంలో కన్నూరుపాలెం, కశింకోట డీపీఎన్ హైస్కూలు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. వాలీబాల్‌లో 14 ఏళ్లలోపులో భార్గవి స్కూలు, తాళ్లపాలెం హైస్కూలు, 17 ఏళ్లలోపు కన్నూరుపాలెం, డీపీఎన్ హైస్కూలు, కబడ్డీ 14 ఏళ్లలోపు కన్నూరుపాలెం, వెదురుపర్తి, 17 ఏళ్లలోపు కొత్తపల్లి,తాళ్లపాలెం హైస్కూళ్ల జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. షటిల్‌లో 14ఏళ్లలోపు నరసింగబిల్లి, వెదురుపర్తి హైస్కూళ్లు, 17 ఏళ్లలోపు డీపీఎన్ హైస్కూలు, నరసింగబిల్లి స్కూళ్ల జట్లు కైవసం చేసుకున్నాయి. చదరంగంలో 14 ఏళ్లలోపు తేగాడ మోడల్ స్కూలు, నరసింగబిల్లి హైస్కూలు, 17 ఏళ్లలోపు నరసింగబిల్లి, తాళ్లపాలెం హైస్కూళ్లు, 11ఏళ్లలోపు నరసింగబిల్లి జట్లు ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందాయి. యోగా 14 ఏళ్లలోపు వెదురుపర్తి, కన్నూరుపాలెం, 17ఏళ్లలోపు కన్నూరుపాలెం, ఎఎస్ పేట స్కూళ్లు ప్రథమ,ద్వితీయ స్థానాలు సాధించాయి.

మా జట్లు గెలవడంతో ఆనందం



నేను 9వ తరగతి చదువుతున్నాను. స్కూల్ గేమ్స్‌లో కబడ్డీ, ఖో-ఖో తొలిసారిగా ఆడాను. పోటీలో మా జట్లు గెలిచాయి. ఎంతో ఆనందంగా ఉంది.

– కొమ్మోజు కోటి, కన్నూరుపాలెం గ్రామం, కశింకోట మండలం

మొదటి ప్రయత్నంలోనే గెలిచాం



నేను 9వ తరగతి చదువుతున్నాను. స్కూల్ గేమ్స్‌లో కబడ్డీ తొలిసారిగా ఆడాను. మా జట్టు విజయం సాధించింది. మొదటి ప్రయత్నంలోనే విజయం పొందడం అమితానందాన్ని కలిగించింది.

–కన్నూరు సాయి, అడ్డాంగ్రామం, కశింకోట మండలం

16 మి.మీ వర్షపాతం

అనకాపల్లి: పట్టణ పరిధిలో శుక్రవారం 16.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరీ తెలిపారు. మెట్ట ప్రాంతాల్లో ఆకుకూరలు, కూరగాయలు వేసుకునే రైతులకు వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

వివాదాల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

- డీఎస్ఎన్ఎల్‌యూలో మధ్యవర్తిత్వ పోటీలు ప్రారంభం





మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ, పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ న్యాయ విద్యార్థులు, అధ్యాపకులు,

సబ్బవరం: ప్రస్తుత పరిస్థితుల్లో జాతీయంగా, అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వానికి ప్రాముఖ్యత పెరిగిందని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ) ఉపకులతి ఆచార్య డి.సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక విశ్వవిద్యాలయంలో డీవీ సుబ్బారావు జాతీయ స్థాయి మధ్యవర్తిత్వ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో దేశంలోని వివిధ న్యాయ విశ్వవిద్యాలయాల నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి పెరిగిన ప్రాముఖ్యతకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న అంశాల ఆధారంగా ప్రాక్టికల్‌గా మధ్యవర్తిత్వం ఎలా వహించాలి? జాతీయ, అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు అనుగుణంగా వివాదాలను పరిష్కరించే విధానంలో శిక్షణ కోసం ఇలాంటి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఇకపై ఈ పోటీలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తామన్నారు. మూటింగ్, అడ్వకేసి సొసైటీ గురించి సంక్షిప్తంగా పరిచయం చేస్తూ 2012లో ప్రారంభించిన ఈ సొసైటీ ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. దేశంలో పేరొందిన ప్రఖ్యాత న్యాయవాది డీవీ సుబ్బారావు పేరిట పోటీలను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నామన్నారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్, అకడమిక్ డీన్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, తదితరులు పాల్గొన్నారు.